ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



బడి బాగుకు ఉత్సాహంగా పని చేయాలి

దహెగాం, మే 23 (ఆంధ్రజ్యోతి): బడి బాగు కోసం ఉత్సాహంగా పని చేయాలని మేటివేషనల్ స్పీకర్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత యోగేశ్వర్ అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీలో శుక్రవారం ఎంఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు అవగాహన తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాంలో ఉపాధ్యాయ వృత్తి చాలా పవిత్రమైనదని చెప్పారు. మనం చేసే వృత్తిని ప్రేమిస్తూ విధులు నిర్వహిస్తే అద్భుతమైన పలితాలు సాధించవచ్చన్నారు. పిల్లలు పాఠశాలకు సక్రమంగా హాజర య్యేలా, సర్కారు బడుల వైపు ఆకర్షించడానికి కృషి చేయాల్సిన గురుతర బాధ్యత ఉపాధ్యాయులదేనని అన్నారు. హాజరు శాతం పెంపుదల, పర్యావరణ పరిరక్షణ, కిచెక్ గార్డెన్ నిర్వహణ, బోధన నైపుణ్యాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విశాలాక్షి, శారద, వివకుమార్, కృష్ణమూర్తి, వినోద్‌కుమార్, కొమురయ్య, మహేష్ పాల్గొన్నారు.

అధికారుల స్థల పరిశీలన

జైనూర్, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జామ్నిలో శుక్రవారం అధికారులు స్థల పరిశీలన చేశారు. ఇన్‌చార్జి తహసీల్దార్ అడ బీర్షావ్ మాట్లాడుతూ ప్లాస్టిక్ నిర్వాహణ విభాగం కింద వివిధ వస్తువులు తయారు చేసేందుకు గానూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భూమిని పరిశీలించామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఎంపీవో మోహన్, ఈవో ఆనంద్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

ఇక ముఖగుర్తింపుతో
పింఛన్ల పంపిణీ

- సెర్ప్ ఆధ్వర్యంలో ప్రత్యేక యాప్ రూపకల్పన
- త్వరలోనే అమలుకు సిద్ధం
- వృద్ధులకు తీరనున్న కష్టాలు
- అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు



కాగజ్‌నగర్, మే 23 (ఆంధ్రజ్యోతి): వయసు పైబడిన చాలా మందికి చేతి వేలి ముద్రలు పడక పింఛను పొందడంతో ఇబ్బంది పడుతున్నారు. ఇలాంటి వారికి పంచాయతీ కార్యదర్శుల అథెంటిఫి కేషన్ ద్వారా అందిస్తున్నారు. ఇలాంటి సమస్యకు చెక్ పెట్టేందుకు సెర్ప్ ఆధ్వర్యంలో ముఖ గుర్తింపుతో లబ్ధిదారులను గుర్తుపట్టే ప్రత్యేక యాప్ రూపకల్పన చేశారు. త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈయాప్ అమలు జరిగితే వృద్ధులకు పింఛన్ పంపిణీ సులభతరం కానుంది. ప్రస్తుతం పంపిణీ చేస్తున్న పింఛన్‌లో వృద్ధులకు వేలి ముద్రలు సరిపోకుంటే సంబంధిత కార్యదర్శి అథెంటికేషన్ ద్వారా అందిస్తున్నారు. లబ్ధిదారులు వచ్చిన సమయంలో కార్యదర్శి ఉండక పోవడం, కార్యదర్శి వచ్చిన సమయంలో లబ్ధిదారులు ఉండక పోవడంతో పింఛన్ సకాలంలో పొందలేని పరిస్థితి నెలకొంది. ఈ సమస్య పరిష్కారా నికి ఈ నెల 10న రాష్ట్ర సెర్ప్ సీఈవో దివ్యరాజన్, పింఛన్ల డైరెక్టర్ గోపాల్‌రావు అన్ని జిల్లాల డీఆర్డీవోలు, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సూచనలు చేశారు.

ఇబ్బందులు ఇలా..

పంచాయతీ కార్యదర్శులు ఇతర పనుల ఒత్తిడితో కార్యాలయానికి రాక పోతే వేచి చూడాల్సిన పరిస్థితి ఉంది. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో సిగ్నల్ సమస్య నెలకొంది. అవి వచ్చే ప్రాంతాల్లో తపాలాశాఖ సిబ్బంది వెళ్లి పంపిణీ చేయాల్సి వస్తోంది. కార్యదర్శులు రాకుంటే లబ్ధిదారులు అంత దూరం వెళ్లి తిరిగి రావాల్సిన పరిస్థితి ఉంది. ప్రసుత్తం దివ్యాంగులకు రూ.4016, ఇతర వర్గాలకు రూ.2016 పింఛన్ ఇస్తున్నారు. జిల్లాలో కేవలం ఫిబ్రవరి నెలలోనే 3,663 మందికి వేలి ముద్రలు పడక పోవడంతో కార్యదర్శుల అథెంటికేషన్ ద్వారా పెన్షన్లు పంపిణీ చేశారు.

కొన్ని సందర్భాల్లో కార్యదర్శుల వేలి ముద్రలు పడని వారి ఒకే సారి అథెంటికేషన్ చేసి వెళ్లిపోతున్నారు. తర్వాత తపాలా సిబ్బంది లబ్ధిదారులకు డబ్బులు అందిస్తున్నారు. త్వరలో అమలు కానున్న సెర్ప్ ఆధ్వర్యంలో రూపొందించిన ప్రత్యేక ముఖయాప్‌తో ఈ కష్టాలు తీరే అవకాశాలున్నాయి. వేలి ముద్రలు సరిపోకపోతే కేవలం ముఖయాప్‌తో గుర్తింపు పొంది లబ్ధిదారుడి పేరిట ఐడెంటీఫికేషన్ చేయ డంతో నేరుగా చెల్లించే అవకా శం ఉంటుంది. ఇక కార్యదర్శి అథెంటికేషన్ అవసరం ఉండదు. ఈ యాప్ అమలు వల్ల పింఛన్ల పంపిణీలో అక్రమాలకు అడ్డుకట్ట పడనుందని చెబుతున్నారు.

జిల్లాలో 54,051 మంది..

జిల్లాలో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, చేనేత, గీత, బీడీ కార్మికులు, ఒంటరి మహిళలు, హెచ్ఐవీ, బోధకాలు డయాలసిస్ చేయించుకునే వారు మొత్తం 54,051 మంది పింఛన్లు పొందుతున్నారు. కాగజ్‌నగర్ మున్సిపాల్టీ పరిధిలో 7,371 మంది ఉన్నారు. వీరందరికి కూడా ప్రతి నెలా బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్నాయి. మిగితా పంచాయతీల పరిధిలో తపాల శాఖ కార్యాలయాల్లోనే వేలి ముద్రల ద్వారా పంపిణీ చేస్తున్నారు. కొందరు వృద్ధుల వేలి ముద్రలు అరిగి పోవడంతో ముద్రలు పడడం లేదు. ఇలాంటి వారికి కార్యదర్శుల వేలి ముద్ర ద్వారా పింఛన్ అందజేస్తున్నారు.

తల్లిదండ్రులకు కడుపుకోత
నీటి కుంటలో పడి ఇద్దరు చిన్నారులు మృతి



మృతి చెందిన లక్ష్మి, హన్సిక(ఫైల్)

కౌటాల, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిపల్లి గ్రామంలో శుక్రవారం బహిర్భూమికి వెళ్లి నీటి కుంటలో పడి ఇద్దరు చిన్నారులు మృతి చెందడం అల్లారుముద్దుగా పెంచుకున్న ఆ తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చింది. బోయర్ లక్ష్మి, షెండె హన్సిక, కవిత, హవి అనే బాలికలు స్నేహితులు. నలుగురు కలిసి శుక్రవారం మధ్యాహ్నం ఊరు బయట వ్యవసాయ చేల సమీపంలో ఉన్న కుంట వద్దకు బహిర్భూమికి వెళ్లారు. అక్కడ ఉన్న కుంటలో నీటిపై బాటిల్ కనిపించింది. దాన్ని తీసేందుకు బోయర్ లక్ష్మి(13), షెండె హన్సిక(11)లు కుంటలోకి దిగారు. ఈ క్రమంలో లక్ష్మి కాలు జారి నీటిలో పడింది. లక్ష్మిని కాపాడేందకు హన్సిక చే యి అందించబోయి ఆమె కూడా కుంటలో పడిపోయింది. గమనించిన కవిత, హవి అనే బాలికలు వెంటనే ఊర్లోకి వెళ్లి కుటుంబసభ్యులకు విషయం తెలిపారు. బంధువులు గ్రా మస్థులు అక్కడికి చేరుకుని చూడగా లక్ష్మి, హన్సిక అప్పటికే మృతి చెందారు. వెంటనే మృతదేహాలను బయటకు తీసి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. మృతి చెందిన లక్ష్మి ది తాటిపల్లి. హన్సికది మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా ఎట్టపల్లి గ్రామం. హన్సిక వేసవి సెలవుల కోసం తాటిపల్లి గ్రామంలోని మేనత్త ఇంటికి పది రోజుల క్రితం వచ్చింది. సెలవులకు వచ్చి ఇలా మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సంఘటన స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాలను పరామర్శించారు. అనంతరం అంబులెన్స్‌లో మృతదేహాలను సిర్పూర్(టి) సివిల్ ఆసుపత్రికి తరలించారు. బాలికల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఎస్సై విజయ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైతులకు న్యాయం జరిగేలా చూస్తాం



రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

సిర్పూర్(టి), మే 23 (ఆంధ్రజ్యోతి): తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని ఉన్నతా ధికారుల దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. మండలంలోని పారిగాంలో కొనుగోలు కేంద్రాల్లో తడిసన ధాన్యాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కోనప్ప మాట్లాడుతూ ప్రస్తుతం అకాల వర్షాలు పడుతున్నందున ధాన్యం కొనుగోళ్లను వేగంగా పూర్తి చేయాలని కోరారు. ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తూ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోకుండా చూడాలని తెలిపారు. తాను కొనుగోలు కేంద్రాల్లోని పరిస్థితిని అధికారులకు తెలియజేసేందుకు పరిశీలించి వీడియోలు తీస్తున్నానని చెప్పారు. రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని, అధైర్య పడొద్దని తెలిపారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేస్తున్న అధికారులు

దహెగాం, మే 23 (ఆంధ్రజ్యోతి): వ్యాపారులు రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కవిత, ఏవో రామకృష్ణ, ఎస్సై విక్రమ్ అన్నారు. మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాలను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీలర్లకు పలు సూచనలు చేశారు.. ఖరీఫ్ ప్రారంభమవుతున్నందున రైతులకు కావాల్సిన విత్తనాలను, ఎరువులను అందుబాటులో ఉంచాలన్నారు. స్టాక్ రిపోర్టు, స్టాక్ బోర్డులు అందరికి కనిపించేలా ఉంచాలని చెప్పారు. రైతులకు కావాల్సిన విత్తనాలు మాత్రమే విక్రయించాలని తెలిపారు.

తడిసిన ధాన్యం
కొనుగోలు చేయాలని రాస్తారోకో



సిర్పూర్(టి)లో రైతులు, నాయకులతో కలిసి రోడ్డుపై బైఠాయించిన ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

సిర్పూర్(టి), మే 23 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని శుక్రవారం సిర్పూర్(టి) మండలం పారిగాం గ్రామంలోని సిర్పూర్ (టి)- కౌటాల ప్రధాన రహదారిపై రైతులు, బీజేపీ నాయకులు రాస్తారోకో చేపట్టారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు రైతులకు మద్దతు తెలిపారు. రైతులతో కలిసి రోడ్డుపై బైఠాయించారు. వర్షాలతో తడిసి పోయిన ధాన్యం మొత్తం కొనుగోలు చేయాలి డిమాండ్ చేశారు. పరిస్థితిని తెలుసుకున్న అదనపు కలెక్టర్ డేవిడ్ అక్కడికి చేసుకుని తడిసిన ధాన్యం మొత్తం కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. రైతులకు ఆందోళనకు గురికావద్దని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షురాలు లావణ్య, నాయకులు ఉన్నారు.

కౌటాల, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్తంపేట వరి కొనుగోలు కేంద్రాల వద్ద , తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ సిర్పూర్(టి)- కౌటాల ప్రధాన రహదారిపై రైతులు రాస్తారోకో చేపట్టారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు రైతులు భారీ ఎత్తున రాస్తారోకో చేయడంతో మూడు గంటల పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అక్కడకు చేరుకుని రైతులకు మద్దతుతా రాస్తారోకోలో కూర్చున్నారు. రైతుల కష్టాలపై కలెక్టర్‌కు వివరించినా పట్టించుకోవవడం లేదని కలెక్టర్ వచ్చే వరకు రైతులకు మద్దతు తెలుపుతానని ఆయన అన్నారు. విషయం తెలుసుకున్న అదనపు కలెక్టర్ డేవిడ్ అక్కడికి చేరుకుని వారం రోజుల్లో ధాన్యాన్ని పూర్తిగా ప్రభుత్వం తరఫున కొనుగోలు చేస్తామని రైతులకు హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. కార్యక్రమంలో బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు దోని శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

చింతలమానేపల్లి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని రవీంద్రనగర్-1 గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో 15 రోజులుగా ధాన్యం కాంటా చేయడం లేదని పలువురు శుక్రవారం రైతులు ఆందోళన చేపట్టారు. ప్రధాన రహదారిపై ధాన్యం బస్తాలను ఉంచి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు విషయంలో అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారని చెప్పారు. అకాల వర్షాలతో ధాన్యం పూర్తిగా తడిసి పోయిందన్నారు. దీంతో తమకు తీవ్ర నష్టం కలిగిందని తెలిపారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఆసిఫాబాద్‌రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూర్గుడ గ్రామానికి చెందిన గాజుల ప్రతాప్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి స్థానిక యువకులు సేకరించిన 52వేల రూపాయలు శుక్రవారం అందజేశారు. మృతుడికి ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. వారిది పేద కుటుంబం కావడంతో గ్రామ యువత సోషల్ మీడియాలో చందాల కోసం అభ్యర్థించారు. జమ చేసిన మొత్తం కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంత్యక్రియలకు..

జైనూర్, మే 23 (ఆంధ్రజ్యోతి): సీడీపీవో కార్యాలయంలో పని చేస్తూ గుండెపోటుతో మృతి చెందిన ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత కుటుంబీలుకు అంత్యక్రియల కోసం 30 వేల రుపాయలను సీడీపీవో ఇందిర శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా సీడీపీ వో మాట్లాడుతూ సుజాత సేవలు అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి

ఆసిఫాబాద్, మే 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా వారం రోజులుగా అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని సీపీఎం నాయకులు శుక్రవారం ఏవో మధుకర్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం అకాల వర్షాలు పడుతున్నందున ధాన్యం కొనుగోళ్లను వేగంగా పూర్తి చేయాలని కోరారు. ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తూ కొనుగో లు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోకుండా చూడాలని తెలిపారు రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో దినకర్, రాజేందర్, కార్తీక్ పాల్గొన్నారు.

ఒకరి అదృశ్యం.. కేసు నమోదు

ఆసిఫాబాద్‌రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పట్టణంలోని ఓ హోటల్‌లో కూలి పని చేస్తున్న కామారెడ్డి జిల్లాకు చెంది న శ్రీకాంత్‌గౌడ్ 25 రోజుల క్రితం ఇంట్లో నుంచి వెళ్లి పోయాడు. ఆచూకీ కోసం బంధువులు ఇళ్లల్లో వెతికారు. శుక్రవారం భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చెత్తాచెదారం ఎప్పటికప్పుడు తొలగించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో ఆల్బర్ట్

దహెగాం, మే 23 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం సమీపిస్తున్నందున గ్రామాల్లో చెత్తాచెదారం ఎప్పటికప్పుడు తొలగించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో ఆల్బర్ట్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి వనరుల వద్ద ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. వయోజన విద్యలో భాగంగా నిరక్షరాసులను గుర్తించాలని సూచించారు. బడిబాట కార్యక్రమం జూన్ 6 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దీన్ని విజయవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఆయన వెంట స్థానిక సిబ్బంది ఉన్నారు.

పరిశీలించి..సూచనలు చేసి..



గోరియాగూడ సమీపంలోని వాగును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

కెరమెరి, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారుమూల గ్రామాల్లో శుక్రవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారి పర్యటించి సమస్యలు అడిగి తెసుకుని సూచనలు చేశారు. మండలంలో గల మారుమూల గ్రామాలను తహసీల్దార్ దత్తు ప్రసాద్, ఎంపీడీవో అంజద్‌పాషాలతో కలిసి శుక్రవారం అదనపు కలెక్టర్ సందర్శించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని తుమ్మగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని గోరియాగూడ గ్రామానికి చేరుకోవడానికి ఉన్న మార్గాలను పరిశీలించి ప్రజలకు ఇబ్బంది లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచిం చారు. అనతరం గోరియాగూడ గ్రామాన్ని సందర్శించి గ్రామంలో నెలకొన్న పరిస్థితులపై సమీక్షిం చారు. నిత్యావసర వస్తువుల కోసం వర్షాకాలంలో గ్రామంలో నెలకొన్న రవాణా సమస్యలను గ్రామస్థులు ఆయన దృష్టికి తీసుకు వచ్చారు. త్వరలోనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మారుమూల గ్రామాలకు రవాణా సదుపాయాలు కల్పించి పౌర సరఫరాల సేవలు అందుబాటులో ఉండే విధంగా కృషి చేస్తామని తెలిపా రు. రవాణా సౌకర్యాలు లేని మారు మూల గ్రామాలకు రేషన్ సరుకులు ముందస్తుగా సరఫరా చేయాలని సూచించారు. వర్షాకాలంలో రవాణా ఇబ్బందులు ఏర్పడిన ప్రజలు నిత్యావసన సరుకులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమస్యలపై ప్రభుత్వానికి నివేదించి త్వరలోనే పరిష్కరించేందుకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(యు), (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులు వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మండలంలోని పూల్లర గ్రామ పంచాయతీ పరిధిలోని దేవుడుపల్లి గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల పనులు వర్షా కాలం ముందే పూర్తి చేయాలన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణలు పాటించాలన్నారు. గ్రామంలో మిషన్ భగీరథ నీటి సరఫరా తీరును పరిశీలించారు. తాగు నీటి ఎద్దడి నివరణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. అంతకుముందు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తులను పరిశీలించారు. రాజీవ్ యువ వికాసం పథకం అర్హులైన లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో కృష్ణారావు ఉన్నారు.

గ్రంథాలయ భవనం ప్రారంభానికి సిద్ధం



ప్రారంభానికి సిద్ధం చేసిన గ్రంథాలయ భవనం

సిర్పూర్(టి), మే 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గ్రంథాల య భవన త్వరలో ప్రారంబించడానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇటీవల సిర్పూర్(టి) మండల పర్యటనకు వచ్చిన రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌కు మండల కేంద్రంలో గ్రంథాలయానికి పక్కా భవనం కేటా యించాలని పాఠకులు కోరారు. దీంతో స్పందించిన ఆయన ఎంపీడీవో కార్యా లయం ఆవరణలో గతంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం నమూనా గృహంను గ్రంథా లయానికి కేటాయించాలని అధికారులకు సూచించారు. ఇదే విషయాన్ని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు జిల్లా అధికారులకు విన్నవించగా ఆ భవనంలో గ్రంథాలయం ఏర్పాటుకు మరమ్మతులు చేయించి ప్రారంభానికి సిద్ధం చేశారు. త్వరలో నే గ్రంథాలయాన్ని ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

శిక్షణను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలి

చింతలమానేపల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు ఇస్తున్న ఎఫ్ఎల్ఎన్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్పీ శ్రీనివాస్ అన్నారు. ఐదు రోజులుగా మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఉపాధ్యాయులకు నిర్వహి స్తున్న శిక్షణ తరగతులను ఎంఈవో, సెంటర్ కో ఆర్డినేటర్ జయరాజుతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ ద్వారా నేర్చుకున్న అం శాలను విద్యార్థులకు చేరవేయాలన్నారు. ఎఫ్ఎల్ ఎన్ ద్వారా విద్యార్థుల స్థాయిని పెంచి ఎన్ఏఎస్ లాంటి సర్వేలో రాష్ట్రాన్ని ముందుంచాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పచ్చిరొట్ట సాగుతో భూసారం

● నాగరాజు, వ్యవసాయాధికారి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి : పచ్చిరొట్ట సాగుతో రైతులకు ఎలాంటి లాభాలు చేకూరుతాయి?

ఏవో : పచ్చిరొట్ట సాగుతో భూసారం పెరుగుతుంది. రైతులు ఇష్టారాజ్యంగా రసాయనిక ఎరువులు వినియోగించడం వల్ల నేల ఆరోగ్యం దెబ్బతింటుంది. దీంతో దిగుబడులు తగ్గుతున్నాయి. పచ్చిరొట్ట పెరిగిన తరువాత పొలంలోనే కలియదున్నితే పంటకు ఎంతో సారం లభిస్తుంది. పచ్చి రొట్టె వల్ల నైట్రోజన్, భాస్వరం లభిస్తుంది. సూక్ష్మజీవులను కాపాడుతుంది. దాంతో భూసారం పెరుగుతుంది.

ఆంధ్రజ్యోతి : రసాయన ఎరువుల వాడకం తగ్గించేందుకు రైతులకు ఎలాంటి సూచన లు చేస్తున్నారు?

ఏవో : రసాయన ఎరువులు వాడకం తగ్గిస్తే మంచిది. వరి పంట పూర్తి కాగానే కొయ్యలను పొలంలోనే దున్నించాలి. జనుము విత్తనాలు చల్లిన తరువాత 40రోజుల్లో పూతకు వస్తాయి. ఆ తరువాత పొలంలోనే కలియదున్నితే సారం పెరుగుతుంది. దాంతో 50 శాతం వరకు రసాయన ఎరువుల వాడకం తగ్గించవచ్చు.

ఆంధ్రజ్యోతి : వరి కొయ్యలను పొలంలోనే కాల్చవచ్చా?

ఏవో : వరి కొయ్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ పొలంలో కాల్చవద్దు. దాంతో భూసారం కోల్పోతుంది. భూమిలోనే ఉండే సూక్ష్మజీవులు చనిపోతాయి. ఇలా చేయడం వల్ల రైతులకు లాభం కంటే నష్టం అధికంగా జరుగుతుంది.

- బెజ్జూరు, ఆంధ్రజ్యోతి

ఇక అటవీ హక్కు పత్రాలకు విరాసత్..!



● తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తుల స్వీకరణ

జైనూర్, మే 23 (ఆంధ్రజ్యోతి): పోడు భూములను సాగు చేసుకుని జీవనం సాగిస్తున్న గిరిజన రైతులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. అటవీ హక్కు పత్రాల విరాసత్ కోసం ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న వారి కల సాకారం కానుంది. అటవీహక్కుల పరిరక్షణ చట్టం (ఆర్‌ఓఎఫ్ఆర్) కింద అటవీ హక్కు పట్టాదారుడు మృతి చెందిన వారి వారసులకు విరాసత్ పట్టాలు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీంతో పోడు దారుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

● జిల్లాలో ఏజెన్సీ ప్రాతం..

జిల్లాలో ఏజెన్సీ ప్రాంతం ఎక్కువగా ఉంటుంది. ఈ ప్రాంతాల్లోని గిరిజనులు ఏళ్లతరబడి పోడు వ్యవసాయంతో జీవనం సాగిస్తున్నారు. దశాబ్దాలుగా వారు సాగు చేస్తున్న అటవీ భుములపై హక్కు కల్పించేందుకు 2006 లో అప్పటి ప్రభుత్వం అటవీ హక్కుల గిర్తింపు చట్టం ద్వార గిరిజనులకు పట్టా పాసుపుస్తకాలు పంపిణీ చేసింది. దీంతో వారంత రైతు భరోసా, రైతు బీమా, పంట రుణాలు, రుణమాఫీ తదితర పథకాలను పొందుతున్నారు. ఈ చట్టాలు పొందిన చాల మంది గిరిజన రైతులు వివిధ కారణాలతో మృతి చెందారు. తదనంతరం వారసులకు విరాసత్ పట్టా చేసే ఆవకాశం ఉంది. కానీ అది అమలు కాక పోవడంతో చాల మంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పట్టా విరాసత్ చేయాలని చాల మంది గిరిజనులు ఐటీడీఏ కార్యాలయంలో పలుమార్లు దరఖాస్తులు సైతం సమర్పించారు. వారసులకు విరాసత్ ఇవ్వక పోవడంతో ప్రభుత్వ పథకాలకు దూరమయ్యారు. గతంలో విరాసత్ కోసం జిల్లాలో 5,621 మంది దరఖాస్తు చేసుకున్నారు.



ఇన్‌చార్జి తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతు

● క్షేత్ర స్థాయిలో పరిశీలించి..

అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటారు. ఇటీవల రాష్ట్ర ప్రభు త్వం అటవీ హక్కుల పట్టాలకు సంబంధించి విరాసత్ పట్టాలు చేసుకోవడానికి ఆవకాశం కల్పించింది. వారసత్వ భూముల యజమాని చనిపోతే ఆయన పేరు మీద ఉన్న భూమి ని వారసులకు సమంగా విరాసత్ చేస్తారు. తహసీల్దార్ కార్యాలయాల్లో విరాసత్ కోరుతూ పట్టాదారుల వారసుల నుంచి దర ఖాస్తులు స్వీకరిస్తు న్నారు. అనంతరం అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి, వారు వారసులేనా అని నిర్ధారించ నున్నారు. తర్వాత వారసుల జాబితాలను ఐటీడీఏ అధికారులకు పంపిస్తారు. పట్టాదారుల వారసులు వారేనా, కాదా అని విచారణ చేసి విరాసత్ పట్టాలను జారీ చేయనున్నారు.

దరఖాస్తు చేసుకోవడానికి జత చేయాల్సిన పత్రాలు..

- అటవీహక్కు పట్టా పాసు పుస్తకం
- కుల ధ్రువీకరణ పత్రం
- ఆధార్ కార్డు,
- మూడు పాస్‌ఫొటోలు
- పట్టాదారుడి మరణ ధ్రువపత్రం
- కుటుంబ సభ్యుల సర్టిఫికెట్.

సద్వినియోగం చేసుకోవాలి..

బీర్షావ్, జైనూర్ ఇన్‌చార్జి తహసీల్దార్



విరాసత్ పట్టాలకోసం ప్రభుత్వం ఆవకాశం కల్పిం చింది. సంబంధిత తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖా స్తులు చేసుకోవాలి. అటవీ హక్కు పట్టాదారులు మృతి చెందితే వారి కుటుంబ సభ్యులు వారసత్వ భూముల విరాసత్ కోరుతు దరఖాస్తులు సమర్పించాలి. జైనూరు మండలంలో 106 మంది పోడు పట్టాదారులు ఉన్నారు. అందులో ఇంత వరకు కేవలం 16మంది మాత్రమే దర ఖాస్తులు చేసుకున్నారు. మిగిత పోడు రైతులు దర ఖాస్తులు చేసుకుంటే అధికారులు పరిశీలిస్తారు.



రెబ్బెనలో రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ డేవిడ్

తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తాం

రెబ్బెన, మే 23 (ఆంధ్రజ్యోతి): తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని అడిషనల్ కలెక్టర్ డేవిడ్ అన్నారు. రెబ్బెనలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామన్నారు. కురుస్తున్న వర్షాలు వరి ధాన్యాం తడువకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు వర్షాన్ని పరిశీలిస్తూ ధాన్యం కుప్పలపై టార్పాలిన్ కవర్లను కప్పుకోవటానికి సిద్దంగా ఉండాలన్నారు. అలాగే సంబంధిత అధికారులు కూడా ఎక్కువ రోజులు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. వచ్చిన ధాన్యం వెంటనే సంబంధిత రైస్ మిల్లలుకు పంపించాలని సూచించారు. ఆయన వెంట తహసిల్దార్ రాంమోహన్‌రావు, సిబ్బంది ఉన్నారు.

అటవీశాఖ అధికారులపై దాడి

జ న్నారం, మే 23 (ఆంధ్రజ్యోతి): కవ్వాల్‌టైగర్ రిజర్వులోని జన్నారం రేంజ్ పరిధిలో గడ్డంగూడ అటవీ ప్రాంతంలోని 308 కాంపార్ట్‌మెంట్‌లో ఆదివాసీ గిరిజనులు భూములు దున్నుతున్నారన్న సమాచారం మేరకు అటవీ శాఖ అధికారులు వెళ్లడంతో వారిపై గిరిజనులు శుక్రవారం దాడికి పాల్పడ్డారు. ఇన్‌చార్జి ఎఫ్ఆర్వో సుష్మారావు తెలిపిన వివరాల మేరకు జన్నారం అటవీ డివిజన్‌లోని ఇందన్‌పల్లి రేంజ్ అధికారి శ్రీనివాస్, సిబ్బందితో జన్నారం, ఇందన్‌పల్లి, తాళ్లపేట్ రేంజ్ అటవి సిబ్బందితో కలిసి శుక్రవారం తెల్లవారుజామున అడ్డుకునేందుకు ఘటనా స్థలానికి వెళ్లారు. దీంతో గడ్డంగూడ, లక్ష్మీపూర్ తండాలకు చెందిన ఆదివాసీ, గిరిజనులు కర్రలు, కారంపొడితో అటవీ శాఖాధికారులపై ఎదురుదాడికి దిగారు. ఈ క్రమంలో ఓ సెక్షన్ అధికారి, ఇద్దరి బీట్ అధికారులకు, బేస్‌క్యాంప్ సిబ్బంది మొత్తం నలుగురికి గాయాలయ్యాయి. దీంతో జన్నారం ఎఫ్ఆర్‌వో సుష్మారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయంతో 11 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజవర్ధన్ తెలిపారు

పెద్దపులిని హతమార్చిన కేసులో 16 మంది రిమాండ్



అటవీశాఖ అధికారులు అదుపులోకి తీసుకున్న నిందితులు

పెంచికలపేట, మే 23 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికలపేట ఎల్లూరు అటవీ ప్రాంత సమీపంలో ఎనిమిది రోజుల క్రితం విద్యుత్ తీగలు అమర్చి పెద్దపులిని హతమార్చిన కేసులో శుక్రవారం 16 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తర లించారు. ఈ కేసులో ప్రమేయం ఉన్న అప్పాజీ శ్రీనివాస్, అప్పాజీ వెంకటేష్, ఎల్కర్ శేఖర్, రోహిణి శ్రవణ్, చప్పిడి అశోక్, చాపిడే పవన్‌కుమార్, ఎల్కరి ప్రకాష్, బుర్రి వెంకటేష్, కాటేల సాగర్, నికాడి వెంకటేష్, లాత్కరి శ్రీనివాస్, భీంకారి వెంకటేష్, భీంకారి రంగయ్య, లేగల గోపాల్, రాచకొండ లచ్చయ్య, ఒంర్రె సంతోష్ అనే వ్యక్తులను అధికారులు కోర్టులో హాజరు పరిచారు. కోర్టు నిందితులకు 14 రోజుల జ్యుడిషియల్ కస్టడీ విధించడంతో ఆసిఫాబాద్ జిల్లా సబ్ జైలుకు తరలించారు. కాగా ఈ కేసులో ప్రమేయం ఉందనే అనుమానంతో మరి కొంత మంది అనుమానితులను అటవీ శాఖాధికారులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలుస్తోంది. పెంచికలపేట, దహెగాం మండలాలకు చెందిన వ్యక్తులు సుమారుగా 14 మంది అదుపులో ఉన్నట్లు సమాచారం.

ప్రాణాలు పోయినా భూములను వదులుకోం



పోడు రైతులతో మాట్లాడుతున్న అటవీశాఖ అధికారులు

చింతలమానేపల్లి, మే 23(ఆంధ్రజ్యోతి): ప్రాణాలు పోయినా సరే పోడు భూములను వదులుకోమని రైతులు అన్నారు. చింతలమానేపల్లి మండలం డబ్బా, కొత్తగూడెం గ్రామ శివారులో గల పోడు భూముల్లో పత్తి కట్టెను రైతులు తొలగించే క్రమంలో అటవీ అధికారులు అడ్డుకొని పోడు సాగు చేయవద్దని సూచించారు. దీంతో పోడు రైతులకు, అటవీ అధికారులకు మధ్య వాగ్వాదం జరిగింది. గత 30 ఏళ్ల నుంచి ఈ భూమిపై ఆధార పడి జీవనం సాగిస్తున్నామని, ఇప్పుడు ఈ భూమిలో సాగు చేయవద్దని అంటే మా జీవితాలు ఏమి కావాలని ప్రశ్నించారు. అనంతరం అటవీ శాఖాధికారులు రైతులను సముదాయించి వారి ఇళ్లకు పంపించారు.

ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలం

కౌటాల, మే 23 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దోని శ్రీశైలం అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వర్షాలు కురుస్తున్నా ధాన్యంకొనుగోలు చేయకుండా ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తుందని దీని వల్ల రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం కొనుగోలు చేయకపోతే ఆందోళన చేపడుతామని తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



గోర్యగూడ వాగును పరిశీలిస్తున్న ఏఎస్పీ చిత్తరంజన్

కెరమెరి, మే 23 (ఆంధ్రజ్యోతి): నది పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్పీ చిత్తరంజన్ అన్నారు. గోర్యగూడ వాగును శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నది పరివాహక ప్రాంతాల ప్రజలు వాగు ప్రవాహాన్ని పరిశీలించిదాటాలన్నారు. గర్భిణులు, వ్యాధిగ్రస్తులు తగు జాగ్రత్తలు తీసుకొని వాగు దాటాలన్నారు.ఎగువన ఉన్న జైనూ రు, నార్నూర్ ప్రాంతాలలో వర్షం కురిసినట్లయితే ఈ ప్రాంతంలో వాగులు పొంగుతాయని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

ఆసిఫాబాద్ రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయంలో పని చేసుష్తేన్న పార్ట్ టైం స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం గ్రంథాలయ డైరెక్టర్ శ్రీహరికు వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్‌తో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హుస్సేన్, ప్రధాన కార్యదర్శి మధు, కోశాధికారి మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



అమృతమిత్రలకు బాటిళ్లు, పెన్నులు, టోపీలు పంపిణీ చేస్తున్న కలెక్టర్

కాగజ్‌నగర్ టౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటి సంరక్షించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అమృత్ 2.0లో భాగంగా మాతృమూర్తులకు సంకేతంగా ఈ కార్యక్రమం ప్రారంభించినట్లు తెలిపారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వస్తున్న మార్పులకు, ఇతర కాలుష్య కారకాలను తగ్గించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో తోడ్పతుతాయన్నారు. అమృత మిత్రలు, ఎస్‌హెచ్‌జీలు పట్టణాల్లో గుర్తించిన చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాల్లో, ఖాళీ స్థలాలు, పార్కుల్లో మొక్కలు నాటాలన్నారు. జూన్ 5 నుంచి ఆగస్టు 31 వరకు మొక్కలు నాటి, వాటిని సంరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా అమృతమిత్రలకు బాటిళ్ల, పెన్నులు, టోపీలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అంజయ్య, తహసీల్దార్ కిరణ్, డీఈఈ రమాదేవి, డీఎంసీ మోతీరాం, టీఎంసీ ఉష, ఇంజనీర్ ప్రణీల్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

కాగజ్‌నగర్‌లోని పలు ఎరువుల దుకాణాలను కలెక్టర్ వెంకటేష్ దోత్రే తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్, రసీదు పుస్తకాలు, ధరల పట్టిక, తూకం యంత్రం, విత్తన ప్యాకెట్లను పరిశీలించారు. వ్యాపారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. దుకాణంలో నిల్లల వివరాలను ప్రతీ రోజు వ్యవసాయ శాఖ అధికారులకు అందించాలని ఆదేశించారు. నిబంధనలకు అనుగుణంగా రైతులకు విత్తనాలు, ఎరువులు అందించాలని, నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంతామని తెలిపారు. కార్యక్రమంలో డీఏవో శ్రీనివాస్ రావు, ఏడీఏ మనోహర్, డీలర్లు, రైతులు పాల్గొన్నారు. అనంతరం కాగజ్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఐకేపీ, మున్సిపల్ సిబ్బందిని దరఖాస్తుల పై ఆరా తీశారు. ఎస్సీ, ఎస్టీ, బీసి, ఈబిసి, మైనారిటీ, క్రిస్టియన్ మైనారిటీ కింద 3,049 దరఖాస్తులు వచ్చినట్లు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో నోడల్ అధి కారి బీసీ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సజీవన్, ప్రత్యేకా ధికారి, ఏడీఏ మనోహర్, తహసీల్దార్ కిరణ్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య పాల్గొన్నారు.

సింగరేణి సమాచారం

కార్పొరేట్ జీఎం సేవలు అభినందనీయం

శ్రీరాంపూర్, మే 23 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ జనరల్ మేనేజర్ సూర్యనారాయణ సేవలు అభినందనీయమని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ ఎం. శ్రీనివాస్ అన్నారు. పదవి విరమణ పొందుతున్న సందర్భంగా శుక్రవారం సూర్యనారాయణను సన్మానించారు. సంస్థలో 36 ఏళ్ల పాటు వివిధ స్థాయిలో పని చేసి సింగరేణి అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఇన్‌చార్జీ ఎస్‌వోటూ జీఎం శ్రీధర్, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షులు వెంకటేశ్వర్ రెడ్డి, ఏజీఎం (ఫైనాన్స్) బీభత్స, ఏజీఎం (క్వాలిటీ) నవీన్, ప్రాజెక్ట్ ఆఫీసర్ టి. శ్రీనివాస్, ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, పి అరవిందరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులు నిరంతరం సాధన చేయాలి



టీషర్ట్స్ అందజేస్తున్న జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్, మే 23 (ఆంధ్రజ్యోతి): నిరంతరం సాధన చేస్తేనే క్రీడాకారులకు మంచి భవిష్యత్తు ఉంటుందని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ ఎం శ్రీనివాస్ అన్నారు. ప్రగతి స్టేడియంలో వర్క్స్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 25 రోజుల పాటు నిర్వహించిన వేసవి ఉచిత శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో శుక్రవారం క్రీడాకారులకు టీ షర్ట్‌లను, కోచ్‌లకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీజీఎం (పర్సనల్)పి. అరవిందరావు, స్పోర్ట్స్ హనరరీ సెక్రటరీ పాల్‌స్రుజన్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ చాట్ల అశోక్, కోఆర్డినే టర్ ఎస్. నర్సయ్య, ఇండోర్ కెప్టెన్ తోట సురేష్ పాల్గొన్నారు.

కార్మికుల పిల్లలు ఉన్నత చదువులపై దృష్టి సారించాలి



స్కాలర్‌షిప్ చెక్కు అందజేస్తున్న జీఎం దేవేందర్

మందమర్రి టౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికుల పిల్లలు ఉన్నత చదువులపై దృష్టి సారించాలని జీఎం దేవేందర్ అన్నారు. ఏరియా వర్క్‌షాపులో పని చేస్తున్న బొడ్డు కుమారస్వామి కుమార్తె వైష్ణవి ఉస్మానియా మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ నాలుగో సంవత్సరానికి పది వేల మెరిట్ స్కాలర్‌షిప్‌ను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణిలో ఎంతో మంది కార్మికుల పిల్లలు ఉన్నత విద్య అభ్యసిస్తున్నారని చెప్పారు. వారిని ప్రోత్సహించేందుకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్మికుల పిల్లలు కార్మికులుగా ఉండవద్దని, ఉన్నత చదువులు చదివి ఉన్నతస్థాయిలో ఉండాలన్నదే తమ లక్ష్యమన్నారు. యాజమాన్యం సామాజిక బాధ్యతతో ముందుకు వెళ్తుందని పేర్కొన్నారు. అధిక శాతం పిల్లలు వైద్య విద్యాభ్యాసం పూర్తిచేసే స్థాయిలో ఉన్నారని, వారంతా పేద ప్రజల ఆరోగ్యానికి కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు. అంతే కాకుండా ఉన్నత విద్య చదివిస్తున్న తల్లిదండ్రులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో పీఎం శ్యాంసుందర్, జీఎం స్ట్రక్చర్ కమిటి సభ్యులు రమణ, రాజలింగు పాల్గొన్నారు.

కష్టపడి పని చేస్తే ఉన్నత స్థాయి

మందమర్రి టౌన్, (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలో ఇష్టపడి పని చేస్తే ఉన్నత స్థాయికి చేరుకుంటారని, విధులకు గైర్హాజరైతే ఉద్యోగం కోల్పోతారని జీఎం దేవేందర్ అన్నారు. జీఎం కార్యాలయంలో మెడిక ల్ ఇన్వాలిడేషన్ కింద 11 మందికి కారుణ్య నియా మక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు మందమర్రి ఏరియాలో 1,985 మంది ఉద్యోగంలో చేరారని అన్నారు. ఇతర పరిశ్రమల కంటే సింగరేణి లో పని స్థలాలు భిన్నంగా ఉంటాయని, దానిని తట్టుకొని ముందుకు వెళ్తేనే పదోన్నతులు సాధిస్తారని తెలిపారు. గతంలో పోలిస్తే ప్రస్తుతం ఆయా వృత్తులకు సంబంధించి 190 మస్టర్లు నిండితే యాక్టింగ్ ప్రాతిపదికన వెంటనే ప్రమోషన్లు పొందవచ్చన్నారు. విద్యార్హతల ఆధారంగా సింగరేణి డైరెక్టర్ స్థాయికి కూడా వెళ్లే అవకాశాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో పీఎం శ్యాంసుందర్, ఏఐటీయూసీ స్ట్రక్చర్ కమిటీ సభ్యులు రమణ, సత్యబోస్, రాయలింగు తదితరులు పాల్గొన్నారు.

అవినీతిని అరికట్టేందుకు నిఘా విభాగాలు

మందమర్రి టౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని ఆరు జిల్లాల్లో విస్తరించి ఉన్న సింగరేణి లో అవినీతిని అరికట్టేందుకు సంస్థకు సంబంధించి విజిలెన్స్ విభాగంతో పాటు ఏసీబీ టీములుగా సంచ రిస్తున్నట్లు సమాచారం. సంస్థలో అవినీతిని అరికట్టేం ుకు ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల సీఎండీ బలరాం గనుల, డిపార్టుమెంట్ల వారీగా అధికారులతో పాటు చిన్న చితక లీడర్లు ఆయా పనులకు లంచాలు తీసుకుంటున్నారనే ఆరోపణల నేపథ్యంలో సంస్థ యాజమాన్యం పారదర్శకంగా పని చేస్తుందనడానికి కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకున్నారు. గనుల్లో, డిపార్టుమెంట్లలో అధికారులు అవినీతికి పాల్పడే వారిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. షిఫ్టు చేంజ్ నుండి మొదలు సర్ఫేస్ కావాలని అంటే గనులకు సంబంధించి లీడర్లు డబ్బులు తీసుకొని సర్ఫేస్‌లో విధులు కల్పిస్తున్నారని అభియోగాల నేపథ్యంలో కూడా దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలుస్తుంది. ఈ మధ్య కాలంలో మెడికల్ అన్‌ఫిట్‌లకు సంబంధించి కార్మికుల నుంచి పెద్ద ఎత్తున లంచాలు తీసుకుంటున్నారనే ఆరోపణలపై సర్వే చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల గోదావరిఖనిలో ఓ బ్రోకర్‌ను అరెస్టు చేసినట్లు తెలుస్తుంది. ఏది ఏమైనా దేశ ప్రగతికి పాల్పడుతున్న సింగరేణి కార్మికులను లంచాల పేరిట జలగల్లా పీల్చుకుతింటున్న వారి నుంచి విముక్తి కలిగించేందుకు ఏసీబీ, విజిలెన్స్ వారు జాయింట్ ఆపరేషన్ మొదలు పెట్టారని సమాచారం.

విద్యుదాఘాతంతో రెండు పశువులు మృతి



మృతిచెందిన పశువులు

తాండూర్, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సాపూర్ పంచాయతీ లోని బెజ్జాల (తలండిగూడ)లో శుక్రవారం ఉదయం గ్రామంలోని విద్యుత్ స్తం భానికి తగిలి విద్యుత్ షాక్‌తో టేకం సోంబాయికి చెందిన ఎద్దు, తలండి జంగు బాయికి చెందిన కోడె ఎద్దు మృతిచెందాయి. మేత కోసం వెళ్తుండగా విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు బాధితులు తెలిపారు. ఎద్దు విలువ రూ. 40 వేలు, కోడె ఎద్దు విలువ రూ. 10 వేలు ఉంటుందని నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధితులు కోరారు.

రాజారంలో ఎద్దు ..

భీమిని, మే 23 (ఆంధ్రజ్యోతి): బిట్టూరుపల్లి గ్రామ పరిధిలోని రాజారం గ్రామంలో ఉన్న కంచెలేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద శుక్రవారం విద్యుతాఘాతంతో ఎద్దు మృతిచెందింది. స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన దుర్గం కృష్ణ ఎద్దు మేత మేస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుత్‌షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ సుమారు రూ. 50 వేలు ఉంటుందని నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతు కృష్ణ కోరాడు.

పుష్కరాల్లో జిల్లా ఉద్యోగుల పర్యవేక్షణ

హాజీపూర్, మే23 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాశేశ్వరం వద్ద నిర్వహిస్తున్న సరస్వతి పుష్కరాల్లో పారిశుధ్య కార్యక్రమాలను మంచిర్యాల జిల్లా పంచాయతీరాజ్ ఉద్యోగులు పర్యవేక్షిస్తున్నారు. జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు మండల పంచాయతీ అధికారులు సప్దర్ అలీ, ఇన్‌చార్జి డీఎల్‌పీవో శ్రీపతి బాపురావు, జైపూర్ ఎంపీవో సత్యనారాయణ, అజ్మత్‌అలీ, శ్రీనివాస్, జి. అనిల్‌కుమార్, ప్రసాద్‌లు హాజరయ్యారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

మందమర్రిరూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి) : చదువులో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఈవో దత్తుమూర్తి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఆదర్శ పాఠశాలలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణను ఆయన పరిశీలించి మాట్లాడారు. శిక్షణలో నేర్చుకున్న విషయాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులకు పాఠాలను బోధించాలన్నారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ శిక్షణ శనివారంతో ముగుస్తుందన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

తాండూర్, మే 23 (ఆంధ్రజ్యోతి) : తాండూర్ మండల నూతన తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన జ్యోత్స్నను శుక్రవారం తుడుందెబ్బ సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించారు. మండలంలోని ఆదివాసీల సమస్యలను పరిష్కరించాలని కోరారు. తుడుందెబ్బ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు మండిగ రవీందర్, మండల అధ్యక్షుడు కుర్సెంగ బాపురావు, ప్రధాన కార్యదర్శి సమ్మయ్య, నాయకులు ఉన్నారు.


దేవాలయంలో భక్తుల రద్దీ


సరస్వతి నది తీరాన భక్తులు



పుష్కర తీరం

పులకించిన భక్తజనం

- హాజరైన హంపి పీఠాధిపతి
- తొమ్మిదో రోజు 1.3 లక్షల మంది భక్తుల పుణ్యస్నానాలు



కాళేశ్వరం, మే 23 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వర క్షేత్రంలో నిర్వహిస్తున్న సరస్వతి పుష్కరాల్లో తొమ్మిదో రోజు శుక్రవారం 1.3 లక్షల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. పుష్కరాలకు మరో మూడు రోజులు మాత్రమే గడువు ఉండడంతో భక్తుల సంఖ్య పెరుగుతోంది. ఈ సందర్భంగా భక్తులు త్రివేణి సంగమంలో చీరె, సారె, పూలు, పండ్లు, దీపాలు సమర్పించారు. పలువురు భక్తులు తమ పితృదేవతలకు పిండప్రదానాలు చేసి తర్పణాలు వదిలి దానధర్మాలు చేశారు. అనంతరం కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకున్నారు. హంపి విరుపాక్ష పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి శుక్రవారం పుణ్యస్నానం ఆచరించారు. భక్తులకు స్వామీజీ ప్రసాదాలను పంపిణీ చేశారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి కుటుంబ సభ్యులతో నదిలో పుణ్యస్నానం ఆచరించి ముక్తీశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుభానందదేవి ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం దేవాదాయ శాఖ అధికారులు ఆలయ శేష వస్త్రాలతో ఎమ్మెల్యేను సన్మానించారు.

- కన్నుల పండువగా హారతి

సరస్వతి పుష్కరాల నేపథ్యంలో కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో కాశీ పండితుల ఆధ్వర్యంలో హారతిని కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాశీ పండితులకు స్థానిక అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారికి పూర్ణాహుతులతో హారతి సమర్పించారు. ఈ హారతి కార్యక్రమం సరస్వతి నవరత్న మాల ఉత్సవాల్లో ఒక ముఖ్యమైన ఘట్టం అని అర్చకులు తెలిపారు.







రైతులు సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలి

కాసిపేట, మే23 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో వస్తున్న శాస్త్ర సాంకేతిక మార్పులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ కోట శివక్రిష్ణ అన్నారు. శుక్రవా రం మల్కపల్లిలో ఏర్పాటు చేసిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్ర మానికి అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం సంయుక్తంగా నిర్వహిస్తున్న రైతులకు పంట సాగుపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ రైతుల అభ్యున్నతికి వ్యవసాయంలో వస్తున్న ఆధునిక సాంకేతికతను రైతులకు చేరవేసే ఉద్దేశంతో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యంగా రైతులు యూరియా వినియోగాన్ని తగ్గించాలన్నారు. వీటితో పాటు సాగు ఖర్చును తగ్గించుకొని రసాయనిక ఎరువులను తగ్గించడం వల్ల నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడినవారమవుతామన్నారు. అలాగే రైతులందరూ కూడ విత్తనాలను కొనుగోలు చేసేటప్పుడు అధికృత డీలర్ల వద్దనే కొనుగోలు చేయాలన్నారు. వారు ఇచ్చిన రశీదులను పంట చేతికొచ్చేంత వరకు దాచుకోవాలన్నారు. అతివృష్టి అనావృష్టి వల్ల పంట దెబ్బతిన్నప్పుడు ప్రభుత్వం నష్టపరిహారం అందజేస్తుందన్నారు. అందుకు ప్రతి రైతు కూడవిత్తనాలు కొనుగోలు చేసిన రశీదులను బద్రపరుచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు పొలంగట్లు, చేన్ల వెంట చెట్లను పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ప్రభాకర్, కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్ర వేత్తలు ప్రియాన్స్ గంది, నాగరాజు, కాసిపేట ఏఈవోలు ప్రతిభ, స్థానిక గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.


మల్కపల్లిలో మాట్లాడుతున్న డాక్టర్ కోట శివక్రిష్ణ

'అయ్యో'మయం

(5వ పేజీ తరువాయి)

సిబ్బంది నిర్లక్ష్యం కూడా ఉందన్న ప్రచారం జరిగింది. క్షేత్ర స్థాయిలో స్థలాలను సందర్శించి దరఖాస్తులను పరిష్కరించవలసిన అప్పటి అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ 2020 వరకు కొనసాగుతూ వచ్చింది. అప్పటి వరకు కూడా వేల సంఖ్యలో దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఆ తర్వాత వెబ్‌సైట్ మూసివేయడంతో దరఖాస్తులు అటకెక్కాయి.

● మొత్తం ఫీజు చెల్లించిన వారికి పరిష్కారం..

రెగ్యులరైజేషన్ చార్జీలు మొత్తం చెల్లించిన వారి దరఖాస్తులను మాత్రమే పరిష్కరిస్తున్నామని కుడా అధికారులు చెబుతున్నారు. డబ్బులు పూర్తిగా కట్టిన వారికి రెగ్యులరైజేషన్ కోసం నోటీసులు పంపినా స్పందనా లేదని అధికారులు చెబుతుండగా, తమకు ఎలాంటి నోటీసులు అందలేదని దరఖాస్తుదారులు చెబుతున్నారు. రెగ్యులరైజేషన్‌కు అవసరమైన డాక్యుమెంట్లయిన రిజిస్ట్రేషన్ డీడ్, ఎల్‌ఆర్‌ఎస్ ప్లాన్, మార్కెట్ వాల్యుయేషన్ సర్టిఫికేట్, అండర్‌టేకింగ్, ఎన్‌కంబరెన్స్ సర్టిఫికేట్ (ఈ సీ)ని దరఖాస్తుతోపాటు జతచేసిన వారికి సక్రమంగానే ప్రొసీడింగ్స్ అందగా, అరకొరగా జతచేసిన వారికే సమస్యలు ఎదురైనట్లు తెలుస్తోంది. ప్రభుత్వం స్పందించి పదేళ్ల క్రితం రూ. 10వేలు చెల్లించిన వారి సమస్యను పరిష్కరించాలనే విజ్ఞప్తులు ఉన్నాయి.

మొక్కలు నాటి సంరక్షించాలి

బెల్లంపల్లి, మే23 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ప్రభుత్వం చేపట్టిన అమృత్ మిత్ర కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. స్వయం సహాయక సంఘం సభ్యులు మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతలు చేపట్టాలన్నారు. సంరక్షణ, మొక్కలకు సంబంధించి ప్రభుత్వం నుంచి సహకారం ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకం గా చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమాన్ని మహిళసంఘం సభ్యులు పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు ప్రవీన్, సునిల్, దుర్గయ్య, కిషోర్, సంతోష్, సభ్యులు పాల్గొన్నారు.

హనుమాన్ స్వాముల మాల విరమణ

నస్పూర్, మే 23 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ కాలనీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో శుక్రవారం గురుస్వామి ఫణి కుమార్ శర్మ ఆధ్వర్యంలో స్వాములు మాల విరమణ చేశారు. శ్రీ రామ, జై హనుమాన్ జపంతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. మండల, అర్థ మండల, 11 రోజుల దీక్షను చేపట్టిన స్వాముల జయంతి రోజు కొండగట్టు హనుమాన్ స్వామిని దర్శించి కొందరు ఇక్కడకు చేరుకున్నారు. ఆలయంలో గురుస్వామి చేతుల మీదుగా మాల విరమణ చేశారు.

పార్ట్‌టైం స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలి

తాండూర్, మే 23 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయంలో పార్ట్ టైం స్వీపర్ల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం నాయకులు రాష్ట్ర గ్రంథాలయ శాఖ డైరెక్టర్ శ్రీహరిని శుక్రవారం హైద్రాబాద్‌లో కలిసి వినతి పత్రం అందించారు. గ్రంథాలయంలో స్వీపర్ల సమస్యలను, గ్రంథాలయాల్లోని సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పార్ట్‌టైం స్వీపర్ల రాష్ట్ర అధ్యక్షుడు హుస్సేన్, ప్రధాన కార్యదర్శి మధు, కోశాధికారి మధుసూదన్, సహాయ కార్యదర్శులు సలీం, స్వామి, తాండూర్ సహాయ కార్యదర్శి స్వామి తదితరులు పాల్గొన్నారు.

గోదావరిపై వంతెన నిర్మిస్తే ఆర్థిక భారం తగ్గుతుంది

మంచిర్యాలకలెక్టరేట్, మే23 (ఆంధ్రజ్యోతి)! మంచిర్యాల-అంతర్గాం మధ్య గోదావరిపై వంతెన నిర్మిస్తే పేద ప్రజలకు ఆర్థికభారం తగ్గుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు రఘునాథ్ వెర్రబెల్లి అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో గోదావరిరోడ్డు వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వం ప్రతిపాదించిన స్థలంలోనే గోదావరిపై వంతెన నిర్మించాలని డిమాండ్ చేశారు. ఇక్కడ వంతెన నిర్మిస్తే పేద ప్రజలకు రానుపోను రూ 100 మిగులు తాయన్నారు. వంతెన నిర్మించకపోవడం వల్ల ఏడాదిలో 80 నుంచి 100 కోట్ల రూపాయల ఆర్థికభారం ప్రజలపై పడుతుందన్నారు. మంచిర్యాల అంతర్గం మధ్య వంతెన నిర్మాణం వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అమిరిశెట్టి రాజ్ కుమార్, పెద్దపల్లి పురుషోత్తం, ముకేశ్‌గౌడ్, సతీష్‌రావు, మధు, వెంకటకృష్ణ పాల్గొన్నారు.

రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు


వీవో లీడర్లకు బాండ్లను అందజేస్తున్న ఏపీఎం రాజ్‌కుమార్

జైపూర్, మే 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 170 లారీల ధాన్యం కొన్నామని ఐకేపీ ఏపీఎం రాజ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మూడు నాలుగు రోజుల్లో ఇంకా 30 లారీల ధాన్యం కొని 200 లారీలు పూర్తి చేస్తామన్నారు. ప్యాడీ సెంటర్లకు వచ్చిన ప్యాడీ కమీషన్ స్త్రీనిధి సంస్థలో డిపాజిట్ చేసి బాండ్లను 8 వీవో లీడర్లకు రూ. 20 లక్షల మెచ్యూరిటీ బాండ్లను పంపిణీ చేశామన్నారు. ప్రభుత్వ స్కూళ్ల యూనిఫాంలు 60 శాతం కుట్టడం పూర్తి చేశారని తెలిపారు. మహిళ సంఘాలకు వయోజన విద్య సర్వే చేసి మధ్యలో చదువు ఆపివేసిన వారికి మళ్లీ చదువుకుని 10, ఇంటర్ పరీక్షలు రాసి ఉన్నత చదువులు చదువుకోవాలన్నారు. మహిళ సంఘాలకు ఇన్సూరెన్స్ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు మాలతి, వీవో లీడర్లు, సీసీలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

వేమనపల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని మండల ఇన్‌చార్జి తహసీల్దార్ పోచయ్య ఆదేశించారు. శుక్రవారం వేమనపల్లి మండ లంలోని దస్నాపూర్, కొత్తపల్లి, నీల్వాయి, గొర్లపల్లి, వేమనపల్లి, కేతనపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు పడుతున్న దృష్ట్యా కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు. గిర్దావర్ కాలిక్, కేంద్రాల ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలి

కాసిపేట: నాలుగు రోజులుగా మండలంలో కురుస్తున్న మల్కపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద వడ్లు తడిసి ముద్దవుతున్నాయి. తడిసిన ధాన్యాన్ని సైతం ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని బీజేపీ మండల అధ్యక్షులు సూరం సంపత్‌కుమార్ అన్నారు. శుక్రవారం మల్కపల్లిలో నిర్వహిస్తున్న దాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. తుపాన్ ప్రభావం వల్ల కురుస్తున్న వర్షాలకు ధాన్యం తడిసి ముద్దవుతోందన్నారు. ప్రభుత్వం ఎలాంటి కోతలు విధించకుండ రైతుల వద్ద నుంచి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి బోనస్ ప్రకటించాలని కోరారు. పడిగెల మహేందర్‌రెడ్డి బాల్‌రాజ్, అనిల్, అజయ్, అరవింద్ పాల్గొన్నారు.


దస్నాపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి తహసీల్దార్ పోచయ్య

ఆదివాసీలను భయభ్రాంతులకు గురి చేస్తే ఊరుకోం

వేమనపల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి) : గిరిజనులు, ఆదివాసీల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని వారిని భయ భ్రాంతులకు గురి చేస్తే ఊరుకునేది లేదని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎర్మ పున్నం హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని చామనపల్లి గ్రామంలో సంఘం ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆదివాసీలకు గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం పోడు వ్యవసాయం చేసుకుంటున్న రైతుల భూములకు పట్టాలు ఇచ్చిందన్నారు. అయితే అటవీ శాఖ అధికారులు భూములను సాగు చేసుకోనివ్వకుండా అడ్డుకుంటున్నారన్నారు. భూముల్లోకి ఆదివాసీలు వెళ్లకుండా అటవీ అధికారులు బె దిరింపులకు పాల్పడుతున్నారన్నారు. రెవెన్యూ అధికారులకు విన్నవించినా స్పందన లేదన్నారు. అటవీ హక్కు పత్రాలు కలిగిన భూములను రైతులు సాగు చేసుకోవచ్చని కలెక్టర్ చెప్పినా అటవీ శాఖ అధికారులు మాత్రం అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చీకటి, అంజి, మొండి, కమల, మధునక్క, ఓదక్క, గౌతమి పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు


భీమినిలో ఫర్టిలైజర్ దుకాణంలో మందులను పరిశీలిస్తున్న ఏడీఏ

భీమిని, మే 23 (ఆంధ్రజ్యోతి) : డీలర్లు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఏడీఏ సురేఖ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాలను ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా దుకాణాలల్లో విత్తనాలను, మందులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తప్పని సరిగా రైతులకు బిల్లులు ఇవ్వాలని, అధిక ధరలకు విత్తనాలు విక్రయించవద్దని సూచించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలన్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీయాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం దుకాణాల్లో నిల్వల రిజిస్టర్లను పరిశీలించారు. విత్తనాల స్టాక్ బోర్డులు రైతులకు కనబడే విధంగా ప్రదర్శించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో యమునా దుర్గా పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరైతు తమ పేరును నమోదు చేసుకోవాలి

ఫార్మర్ రిజిస్ట్రీ ప్రోగ్రామ్‌లో ప్రతీ ఒక్క రైతు తమ పేర్లను నమోదు చేసుకోవాలని భీమిని ఏడీఏ సురేఖ అన్నారు. శుక్రవారం మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. దీని వల్ల రైతులందరికీ భూమి రికార్డులను, ఇత్తర సమాచారాన్ని ఒకే డిజిటల్ ప్లాట్ ఫార్మర్‌లో కలిగి ఉండేలా సహాయపడుతుందన్నారు. దీనివల్ల రైతులు ప్రభుత్వ పథకాల నుంచి ప్రయోజనం పొందటానికి వ్యవసాయ అధికారుల సేవలను సులభంగా పొందటానికి వీలుకలుగుతందన్నారు. రైతులందరూ ఆధార్ కార్డు, భూమికి సంబంధించిన పత్రాలతో స్థానిక ఏఈవోలతో నమోదు చేసుకోవాలన్నారు. నమోదు పూర్తి అయిన తరువాత రైతుకు ఒక ప్రత్యేక గుర్తింపు నంబరు వస్తుందన్నారు. ఏఈఓలు రైతులకు అందుబాటులో ఉంటూ రిజిస్ట్రీ కార్యక్రమాన్ని వేగ వంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఓ యమునా దుర్గ, ఏఈవోలు వినోద్ కుమార్, రైతులు సింగతి రామన్న, పెరక శంకరయ్య, కామెర తార, దొరిషెట్టి శ్రీనివాస్, ఆకిరెడ్డి చంద్రమౌళి, పోతురాజుల శంకర్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

రామన్ కాలనీ వద్ద నిలుస్తున్న నీరు

స్పందించిన మున్సిపల్ కమిషనర్

మందమర్రిటౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రామన్ కాలనీ వద్ద వర్షం నీరు రోడ్డుపై నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి రోడ్డు మధ్యలో డివైడర్ ఉండడంతో నీరు వెళ్లడానికి వీలు లేక వర్షం నీరు నిలిచి ఉంటుంది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ టి. రాజలింగు శుక్రవారం డ్రిల్లింగ్ మిషన్‌తో రంధ్రం చేసి నీరు వెళ్లేందుకు పైపులను వేయించారు. దీంతో వాహనదారులు, స్థానికులు కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలి

హాజీపూర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని పరిశీలకులు శ్రీనివాసచారి అన్నారు. హాజీపూర్ మండలంలోని ముల్కల్ల ప్రభుత్వ పాఠశాలలో ఐదు రోజులుగా జరుగుతున్న ఉపాధ్యాయ శిక్షణ శిబిరాన్ని డీఈవో యాదయ్యతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాఠశాలల్లో అమలు చేయాలన్నారు. బడిబాట కార్యక్రమం ద్వారా విద్యార్థుల సంఖ్య పెంచాలని సూచించారు. రాష్ట్రాన్ని జాతీయ స్థాయిలో ఉన్నత స్థానంలో ఉంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో తిరుపతిరెడ్డి, కోఆర్డినేటర్ చౌదరి, నోడల్ అధికారి హనుమండ్లు, ముల్కల్ల హెడ్ మాస్టర్ గణపతిరెడ్డి పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణ పనుల పరిశీలన



రాంనగర్‌లో మురుగు కాలువ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నస్పూర్, మే 23 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని (నస్పూర్-21వార్డు) రాంనగర్‌లో డీఎంఎఫ్‌టీ నిధులు రూ. మూడు లక్షల వ్యయంతో నిర్మిస్తున్న డ్రైనేజీ పనులను శుక్రవారం కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. పాత మురుగు కాలువ శిథిలావస్థకు చేరినందున స్థానిక నాయకులు ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు దృష్టికి తీసుకెళ్లడంతో డ్రైనేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. వర్షకాలం దగ్గర పడుతున్నందున త్వరగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి ధరణి మధుకర్, వార్డు అధ్యక్షుడు గోపతి తిరుపతి, నాయకులు బేర సత్యం, శశికుమార్, రాజేష్, అరుణ్, వార్డు వాసులు పాల్గొన్నారు.

పట్టభద్రులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం



మాట్లాడుతున్న వైస్ చాన్స్‌లర్ గంటా చక్రపాణి సింగరేణి సీఎండీ బలరాం


మందమర్రిటౌన్, మే23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని ఆరు జిల్లాల్లో విస్తరించి ఉన్న సింగరేణి పరిసర ప్రాంతాల్లో ప్రతి ఒక్కరిని పట్టభద్రులుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ వైస్ చాన్స్‌లర్ గంటా చక్రపాణి తెలిపారు. శుక్రవారం సింగరేణి సీఎండీ కార్యాలయంలో సీఎండీ బలరాంతో కలిసి మాట్లాడారు. పట్టభద్రులను చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. అంబేద్కర్ ఓపెన్ యూని వర్శిటీ ద్వారా అందరిని పట్టభద్రులుగా తీర్చిదిద్దేందుకు బృహత్తర ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. ఇప్పటికే సింగరేణి ప్రాంతాల్లో వేల మందిని పట్టభద్రులుగా తీర్చిదిద్దామన్నారు. సీఎండీ బలరాం మాట్లాడుతూ ఉన్నత విద్యకు దూరమైన వారు ఓపెన్‌యూనివర్శిటీ ద్వారా చదువుకోవచ్చన్నారు. విద్యతోనే సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. కార్మికులందరు అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీలో చేరాలన్నారు. పట్టభద్రుల ను చేసేందుకు అంబేద్కర్ యూనివర్శిటీతో ఓ ఒప్పందం చేసుకోనున్నామని తెలిపారు. ప్రభావిత, నిర్వాసిత గ్రామాల ప్రజలను చదివించే బాధ్యతను తీసుకుంటామన్నారు. మొదటిసారిగా సీఎండీ కార్యాలయానికి వచ్చిన వైస్ చాన్సు లర్‌కు సీఎండీ పుష్పగుచ్ఛం అందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ అకాడమిక్ విజయ్ కృష్ణరెడ్డి, ప్రొఫెసర్ పల్లవి కబ్డే, పీఆర్‌వో డాక్టర్ వేణుగోపాల్, సింగ రేణి డైరెక్టర్ సుబాని పాల్గొన్నారు.

ఇక అటవీహక్కు పత్రాలకు విరాసత్..

● తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తుల స్వీకరణ

6

'అయ్యో'మయం..



- 2015 నాటి ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు కలగని మోక్షం
- మొత్తం ఫీజు చెల్లించినవారి ఫైళ్లు మాత్రమే క్లియర్
- రూ. 10 వేలు కట్టిన వారిని పట్టించుకోని వైనం
- జిల్లాలో వేల సంఖ్యలో పెండింగ్

మంచిర్యాల, మే 23 (ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్ కోసం 2015 నుంచి 2020 మధ్యకాలంలో రూ.10వేలు చెల్లించి దరఖాస్తు చేసుకున్న వారి పరిస్థితి అయోమయంగా మారింది. ఏళ్లు గడిచినా వారి దరఖాస్తులు ఇప్పటికీ పరిష్కారానికి నోచుకోక పోవడంతో ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న కొత్త విధానం కింద మరోసారి దరఖాస్తు చేసుకునే అవకాశం కూడా వారికి లేకుండా పోయింది. అయితే పూర్తి స్థాయిలో రుసుం చెల్లించినవారి సమస్యలను మాత్రం మున్సిపాలిటీలు పరిష్కరిస్తుండటంతో రూ.10 వేలు చెల్లించి ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న దరఖా స్తుదారులంతా తమ సమస్యకు పరిష్కారం చూపాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

పదేళ్ల క్రితం దరఖాస్తుల ఆహ్వానం...

అనుమతి లేని లే-అవుట్లలోని ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం తొలుత 2015లో అవకాశం కల్పించింది. ఇందుకోసం భూ క్రమబద్ధీకరణ పథకాన్ని (ఎల్ఆర్ఎస్) తీసుకువచ్చింది. ఈ మేరకు 2015 నవంబర్ 2న జీవో నెంబరు 151 జారీ జేసింది. ఎల్ఆర్ఎస్ కింద దరఖాస్తులను ఆహ్వానించింది కూడా. దీంతో ప్రజలు పెద్ద సంఖ్యలో ముందుకు వచ్చారు. జిల్లా కేంద్రంతోపాటు, పరిసర ప్రాంతాల నుంచి సుమారు 40వేలకు వరకు దరఖాస్తులు దాఖల య్యాయి. ఎల్ఆర్ఎస్ చేసే బాధ్యతను ప్రభుత్వం పట్టణాభివృద్ధి సంస్థలకే ప్రభుత్వం అప్పగించడంతో ఆ దరఖాస్తులను పరిష్కరించే బాధ్యత మున్సిపాలిటీలపై పడింది. దరఖాస్తులు దాఖలు సందర్భంగా కుడా రూ.10వేల చొప్పున వసూలు చేయగా, సమస్య పరిష్కారమైన తర్వాత మిగతా డబ్బును దఫాల వారీగా వసూలు చేశారు. దీంతో స్థల విస్తీర్ణాన్ని బట్టి లక్షల రూ పాయల్లో దరఖాస్తుదారులు చెల్లించారు. ఎల్ఆర్ఎస్ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వెబ్ సైట్ ద్వారా వినియోగదారులు దరఖాస్తులను అప్‌లోడ్ చేశారు. లైసెన్స్‌డ్ సర్వేయర్ల సహకారంతో పూర్తి వివరాలను, ఇతర సంబంధిత పత్రాలను జతచేసి, దరఖాస్తు ప్రక్రియపూర్తి చేశారు.

వెబ్‌సైట్ మూసివేయడంతో గందరగోళం...

ఇదిలా ఉండగా ఎల్ఆర్ఎస్ వెబ్‌సైట్‌ను అప్పటి ప్రభుత్వం మూసివేయడంతో గందర గోళ పరిస్థితులు నెల కొన్నాయి. పథకం ద్వారా ఎన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి..? వాటి పరిస్థితి ఏమిటీ...? అన్న విషయాలు తెలిసే అవకాశం లేకుండా పోయింది. అయితే నిబంధనలమేరకు అన్ని సక్రమంగా ఉన్నాయని భావించిన దరఖాస్తుదారులకు మొదట్లో కట్టిన రూ.10వేలకు అదనంగా మార్కెట్ విలువనుబట్టి మిగతా రెగ్యుల రైజేషన్ చార్జీలను చెల్లించాలని మున్సిపాలిటీ లు నోటీసులు అందజేశాయి. ఈ నోటీసులు అందు కున్న వారిలో చాలామంది నిర్దేశిత మొత్తాన్ని చెల్లించారు. అయితే అవి కూడా ఇప్పటి వరకు పరిష్కారానికి నోచుకోలేదు. ఎల్ఆర్ఎస్ స్కీంనిబంధనల మేరకు వినియోగదారుల నుంచి చార్జీలు వసూలు చేసిన అధికారులు వారిలో చాలా మందికి ప్రొసీడింగ్స్ ఇవ్వలేదు. ఇక్కడ రాజకీయ పలుకుబడి ఉన్న వారికి మాత్రం ఎలాంటి జాప్యం లేకుండా ప్రొసీడింగ్స్ అందినట్లు అప్పట్లో విమర్శలు గుప్పు మన్నాయి. మిగతా వారి సమస్య పరిష్కారం కాకపోవడానికి... (తరువాయి 7లో)

కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం వెంటనే తరలించాలి

● కలెక్టర్ కుమార్‌దీపక్

జైపూర్, మే 23 (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షాల దృష్ట్యా వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిన కేటాయించిన ప్రకారం రైసు మిల్లులకు తరలించాలని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ముది గుంట, జైపూర్, శెట్‌పల్లి, కుందారం, వేలాల, కిష్టాపూర్ , పౌనూరు గ్రామాల్లోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ వనజారెడ్డితో కలిసి సందర్శించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో నిబంధ నల ప్రకారం రైతుల వద్ద నుంచి నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామన్నారు. అకాల వర్షాలు కురుస్తున్న దృష్ట్యా కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైసు మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సన్నరకం వడ్లకు మద్దతు ధరతో పాటు రూ. 500 బోనస్ ప్రభుత్వం అందిస్తుందన్నారు. కేంద్రా ల్లో రైతులకు నీడ, తాగునీరు, ఓఆర్ఎస్ అందుబా టులో ఉంచడంతో పాటు అవసరమైన గోనెసంచులు, టార్పాలిన్‌లను సమకూర్చడం జరిగిందన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైసుమిల్లులకు తరలించాలన్నారు. నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తి చేసిన కేంద్రాలను మూసివేశామన్నారు. కేంద్రాల నిర్వహకులు హమాలీల కొరత లేకుండా చూసుకోవాలని, హమాలీల సమయానికి అనుగుణంగా ధాన్యాన్ని లారీల్లో నింపి తరలించాలన్నారు. కాంటా వేసిన ధాన్యాన్ని వెంటవెంటనే మిల్లులకు పంపిం చాలన్నారు. ఈ నెల 25వరకు కొనుగోలు కేంద్రాల్లో వరిధాన్యం నిల్వలు ఉండకూడదని పేర్కొన్నారు. కలెక్టర్ వెంట ఐకేపీ ఏపీఎం రాజ్‌కుమార్ ఉన్నారు.



ముదిగుంటలో కొనుగోలు కేంద్రం నిర్వాహకులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి

మంచిర్యాలకలెక్టరేట్: రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా వరిధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని బీమారం మండలం పొలంపల్లి, భీమారం, అక్కపల్లి, అంకూసపూర్ గ్రామాలలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి దాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో ధాన్యం ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

గుణాత్మకమైన విద్యను అందించాలి

జిల్లా పరిశీలకులు శ్రీనివాసచారి

మంచిర్యాలక్రైం, మే23(ఆంధ్రజ్యోతి) : ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు గుణాత్మకమైన విద్యను అందించాలని జిల్లా పరిశీలకులు, మోడల్ స్కూల్ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసచారి అన్నారు. శుక్రవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల గర్మిళ్లలో నిర్వ హిస్తున్న ప్రధానోపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా డీఈవో యాదయ్యతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులతో స్నేహపూర్వకంగా మెలగాలని వారి సమస్యల పట్ల సహానుభూతితో వ్యవహరించాలన్నారు. సమస్యల పరిష్కారానికి అవసరమైన అన్ని వనరులను సమీకరించాలని విద్యార్థుల శ్రేయస్సు, నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష సెక్యూలర్ అధికారి చౌదరి, సెంటర్ ఇన్‌చార్జి సత్యనారాయణ మూర్తి, ప్రధానోపాధ్యాయులు దత్తకుమార్, సాంబమూర్తి, గిరిధర్‌రెడ్డి, బాలు పాల్గొన్నారు.



శిక్షణ కేంద్రం వద్ద అధ్యాపకులతో మాట్లాడుతున్న జిల్లా పరిశీలకులు శ్రీనివాసచారి

నిధుల లేమితో నిలిచిన వైకుంఠధామం

● అంతిమయాత్రకు ఇబ్బంది పడుతున్న కుటుంబ సభ్యులు

మందమర్రిటౌన్, మే 23(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మూ సివేసిన కేకే 3 గని సమీపంలో ప్రభుత్వ టీఎఫ్ఐడీసీ 2కోట్ల నిధులతో రెండున్నరేళ్ల క్రితం ప్రారంభించిన వైకుంఠదామం పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఈ పనులు నిలిచిపోయి దాదాపు 10నెలలకు పైగా కావస్తుంది. ఎకరం స్థలంలో ఈ పనులను గతప్రభుత్వ హయాంలో ప్రారంభమయ్యాయి. కాంట్రా క్టరు సకాలంలో బిల్లులు రాకనే పనులను నిలిచిపోయినట్లు తెలిసింది. 80శాతం పనులు పూర్తయ్యాయి. మరో కోటిరూపాయలు మంజూరు అయితే పనులు పూర్తవుతాయని సంబంధిత ఇంజనీరింగ్ విభాగం అధికారులు చెబుతున్నారు. కేవలం నిధుల లేమితోనే ఈ పనులు పూర్తి కాలేదని కూడా తెలుస్తుంది.

స్థానికులకు తప్పని తిప్పలు

అర్ధాంతరంగా నిలిచిపోయిన వైకుంఠదామం పనులతో అంతిమయాత్రకువచ్చే కుటుంబాలు నానా ఇబ్బందులు పడుతున్నా రు. మృతదేహాలను పూడ్చేందుకు స్థలం లేక పడరాని పాట్లుప డుతున్నారు. మృతదేహాలను దహనం చేయాలన్నా గతంలో పూ డ్చిన గోరీల మధ్య దహన సంస్కారాలు చేస్తున్నారు. స్నానా లు చేసేందుకు కూడా నానా అవస్థలు పడుతున్నారు. అంతిమ సం స్కార సాంప్రదాయాలను చేసేందుకు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎకరం స్థలంలో నిర్మాణం చేపట్టిన వైకుంఠదామం త్వరగా పూర్తి చేయాలని అంతిమ యాత్రకు వచ్చే కుటుంబాలు కోరుకుంటున్నారు.



నిలిచిపోయిన వైకుంఠధామం

నిధులు మంజూరు చేస్తా : ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి



వైకుంఠదామం పనులు అర్ధాంతరంగా నిలిచిపోయా యనే విషయం తమ దృష్టికి వచ్చింది. త్వరలోనే నిధులను మంజూరు చేసేందుకు కృషి చేస్తా. అంతిమయాత్రకు వచ్చే కుటుంబాలకు అన్ని సౌకర్యాలు ఉండేలా చర్యలు చేపడతాం. పట్టణంలో మిగతా వాటికి సంబంధించి కూడా మున్సిపల్ అధికారులకు ఆదేశా లిచ్చాం. వాటికి కూడా స్థలసేకరణతో పాటు నిధుల వ్యయాన్ని అంచనా వేయాలని చెప్పాం. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉ న్నా వాటి పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టా. .

80 శాతం పనులు పూర్తయ్యాయి : డీఈ సుమతి

వైకుంఠదామం పనులు 80శాతం పూర్తయ్యాయి. ఈ విష యాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం. ఏ మేరకు పనులు పెండింగ్‌లో ఉన్నాయో అంచనా వేయమని ఆదేశించారు. త్వరగా పనులు పూర్తిచేసి అందు బాటులోకి తెస్తాం.

కొనుగోలు కేంద్రాల్లో రైతులను ఇబ్బంది పెట్టవద్దు



రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మోతిలాల్

కోటపల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు రైతులను ఇబ్బంది పెట్టవద్దని అదనపు కలెక్టర్ మోతిలాల్ అన్నారు. శుక్రవారం మండలంలోని బొప్పారం, సర్వాయిపేట, కొండంపేట గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ వర్షాలు పడుతున్నందున ధాన్యం తడవకుండా తగినన్ని టార్పాలిన్‌లు ఏర్పాటు చేసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. అలాగే వడ్ల తేమ శాతం రాగానే వెంటనే కాంటాచేసి లారీల్లో లోడ్ చేసి పంపాలన్నారు. గోనె సంచుల కోసం కానీ, లారీల కోసం రైతులను ఎట్టి పరిస్థితుల్లో ఇబ్బందులు పెట్టవద్దని, ఇండెంట్ పెట్టిన వెంటనే గోనె సంచులు, లారీలు పంపిస్తున్నామన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సమస్యలున్నాయా అని బొప్పారం గ్రామ రైతులను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్యలు లేవని లారీలు సక్రమంగా వస్తున్నాయని రైతులు పేర్కొన్నారు. తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేస్తామని రైతులు అధైర్యపడవద్దని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో కిషన్, డీఎం శ్రీకర, తహసీల్దార్ రాఘవేందర్‌రావు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, వ్యవసాయాధికారులు

తాండూర్, మే 23 (ఆంధ్రజ్యోతి) : రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని తాండూర్ సీఐ కుమారస్వామి పేర్కొన్నారు. శుక్రవారం నకిలీ విత్తనాల నిర్మూలనపై పోలీసులు, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. ఎంపీడీవో కార్యాలయం నుంచి ఐబీ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పత్తి విత్తనాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. నకిలీ విత్తనాలు వాడడం వల్ల భూమి సారవంతం కోల్పోయి పర్యావరణం కూడా దెబ్బతింటుందన్నారు. నకిలీలతో మూడు క్వింటాళ్ల అధిక లాభం వస్తుందని ఆశ పడితే పంట నష్టపోయిన తర్వాత ప్రభుత్వం నుంచి ఎలాంటి నష్టపరిహారం రాదన్నారు. లైసెన్స్ ఉన్న ఫెర్టిలైజర్ దుకాణాల్లోనే విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు కొనుగోలు చేయాలన్నారు. కొన్న వాటికి రశీదులు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయశాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తే పంట దిగుబడి బాగా వస్తుందని పేర్కొన్నారు. అనంతరం నకిలీ విత్తనాలు వాడవద్దని రైతులు, స్థానికులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, మండల వ్యవసాయాధికారిణి సుష్మ, రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీసులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం, ఉప ముఖ్యమంత్రి, పీఎస్ఆర్‌ల చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మంచిర్యాలక్రైం, మే23 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణ మార్కెట్ సుందరీకరణ కోసం రూ.78కోట్లను మంజూరు చేసినందుకు బ్లాక్ కాంగ్రెస్, పట్టణ కాంగ్రెస్ ఆధ్వ ర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం బాణా సంచాకాల్చి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు తూముల నరేశ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే పీఎస్ఆర్ మంచిర్యాల నడిబొడ్డున 300 కోట్లతో సూపర్ స్పెషాలిటి, మా తా శిశు ఆసుపత్రిని నిర్మిస్తున్నారని, పేద మధ్య తరగతి విద్యార్థుల కోసం దండేపల్లి మండలంలో నాలుగువేల మంది విద్యార్థుల కోసం ఇంటిగ్రేటెడ్ రెసిడన్షియల్ స్కూల్ నిర్మాణం చేపడుతున్నారని, నియోజకవర్గంలో 230 స్కూళ్లలో రూ.30కోట్లతో ఆధునీకరణ పూర్తి చేశామని, 11 కోట్లతో మహాప్రస్థానం నిర్మించారని, మంచిర్యాల రాలవాగు చుట్టూ 250 కోట్లతో కరకట్ట నిర్మాణ పనులు మొదలు పెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పూదరి తిరుపతి, మాజీ చైర్మన్ వేణు, మాజీ యూత్ అధ్యక్షుడు సంపత్‌రెడ్డి, నాయకులు సిరిపురం రాజేశ్, పెంట రజిత, హేమలత, బానేష్, ఖలీద్, జలీల్, డేగ బాపు పాల్గొన్నారు

ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలో నమోదు చేసుకోవాలి

● కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలకలెక్టరేట్, మే23(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అర్హత కలిగిన నిరుద్యోగులు వివిధ పరిశ్రమలు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు, కమర్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్ల వివరాలను డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ డీఈఈటీ ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలో నమోదు చేయాలని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఈఈటీ ఆన్‌లైన్ ప్లాట్‌ఫాం కమిటీ పురోగతిపై సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగులకు ఉపాధి కల్పించే విధంగా సంబంధిత శాఖల అధికారులు, సమన్వయంతో పని చేయాలని తెలిపారు. జూన్‌లో జాబ్‌మేళాలు ఏర్పాటు చేయాలని, ఇందుకుగాను ముం దుగానే సమాచారం అందించాలని, తద్వారా నిరుద్యోగ యువతకు మేలు జరుగుతుందన్నారు. జాబ్‌మేళా నిర్వహించేందుకు ఎక్కువ కంపెనీలు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. యువతకు ఉపాధి కల్పించే విధంగాచ ర్యలు తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సి. రవికిరన్, జిల్లా క్రీడా యవజన సేవల శాఖ అధికారి కీర్తి రాజీవీరు, జిల్లా ఉపాధి కల్పన అధికారి రవిక్రిష్ణ, బెల్లంపల్లి పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ దేవేందర్, ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ రమేశ్,పాల్గొన్నారు.

టీడీపీ మంచిర్యాల నగర అధ్యక్షుడిగా తలారి రాజు



శ్రీరాంపూర్, మే 23 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ మంచిర్యాల కార్పొరేషన్ అధ్యక్షులుగా తలారి రాజు ఎన్నికయ్యారు. శుక్రవారం నిర్వహించిన నియోజకవర్గ సర్వసభ్య సమావేశంలో కార్పొరేషన్, మండల, గ్రామ నూతన కమిటీలను ఎన్నుకున్నారు. రాష్ట్ర నాయకులు కోల కిషన్‌రావు, ఎండీ షరీఫ్ ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. కార్పొరేషన్ ప్రధాన కార్యదర్శిగా కంచె భూపతి, ఉపాధ్యక్షులుగా ఆవుల సుధాకర్, కార్యనిర్వాహణ కార్యదర్శిగా గరిగంటి రాజయ్య, మిడిదొడ్డి మొండయ్య, తరాల లక్ష్మీనారాయణ, కార్యదర్శులుగా సామ రఘుపతి, బొజ్జ రవి, కోశాధికారిగా పెద్దపల్లి శంకర్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కోల కిషన్‌రావు మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన వారు పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. టీడీపీకి పూర్వ వైభవం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

పార్టీలో కష్టపడే కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని కడపలో నిర్వహించే మహానాడుకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వెంకన్న, సదానందం, శంకరయ్య పాల్గొన్నారు.